**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 04.10.2026** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విమర్శలు ప్రజాస్వామ్యానికి అవమానకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అన్నారు.
2. మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి వద్ద అమూల్ సబర్ డైరీ ఏర్పాటుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు.
3. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.
4. కోల్ ఇండియా ప్రకటించిన లక్షా పది వేల దీపావళి బోనస్ సింగరేణి కార్మికులకు కూడా వర్తిస్తుందని AITUC కార్మిక సంఘం ప్రకటించింది.

.......................................................................

**బీజేపీ రామచందర్ రావు...**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల ప్రక్రియను, రాహుల్ గాంధీ రాజ్యాంగ సంస్థలను విమర్శించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు అన్నారు. ఆయన ఈ రోజు హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడారు. కేరళలో ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, ఓడిపోయిన చోట ఈవీఎంలు, సర్ ప్రక్రియను తప్పుపట్టడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు ఈ విధానాలను తిరస్కరిస్తారని, దేశం త్వరలో కాంగ్రెస్ ముక్త భారత్‌గా

మారుతుందని రామ్‌చందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా, అలాగే వరుసగా మూడు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు.

**....పిటీసీ హైదరాబాద్**

**భట్టి విక్రమార్క...**

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిన్న సాయంత్రం సచివాలయంలో వనరుల సమీకరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల విలువను పెంచడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం, పర్యాటక రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. HILT పాలసీ కింద అభ్యంతరాలు లేని పార్కుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వాలని ఆదేశించారు.

**...ప్రెస్ నోట్**

**మెదక్ జిల్లా**

మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో నిర్మించనున్న అత్యాధునిక అమూల్ సబర్ డైరీ తెలంగాణ ప్రాజెక్టుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి, పాడి రైతులకు మార్కెట్ సౌకర్యాలు కల్పించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కార్యక్రమంలో పాల్గొన్న నేతలు పేర్కొన్నారు.

...పిటిసి- మెదక్

**పొన్నం ప్రభాకర్...**

ఆటో కార్మికులు, వారి కుటుంబాల కోసం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. దీనిపై చట్ట సభల్లో చర్చించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులతో భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పెంచిన ఆటో ఛార్జీలు సరిపోతాయా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ యువ వికాసం కింద డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రెండు వేల కోట్లు కేటాయించామన్నారు. ఒక్కో ఆటోకు లక్షన్నర వరకు సబ్సిడీ ఇస్తామని తెలియచేశారు.

**...డెస్క్**

**సంగారెడ్డి:**

తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి పట్టణంలో ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేసిన ఒకేషనల్ జూనియర్ కళాశాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం కళాశాలలోని ఒకేషనల్ ట్రైనింగ్ విభాగాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఐటీఐలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు దేశ, విదేశాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, వారికి జర్మన్, జపనీస్ భాషల్లో ప్రభుత్వం శిక్షణ అందిస్తోందని చెప్పారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యంతో పాటు భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఆధునిక సౌకర్యాలతో కళాశాలను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు.

**...పిటీసీ, సంగారెడ్డి**

**మంచిర్యాల ...**

దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు దీపావళి సందర్భంగా చెల్లించే పీఎల్ఆర్ బోనస్‌ను కోల్ ఇండియా ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో కార్మికుడికి 1,10,250

రూపాయలు చెల్లించనుంది. ఈ బోనస్ సింగరేణిలోని 40,300 మంది నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు వర్తిస్తుందని మంచిర్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి మేకల దాసు తెలిపారు.

**బైట్...మేకల దాసు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి**

**పిటీసీ, మంచిర్యాల**

**సారస్ మేళా – సీతక్క...**

ఈ నెల 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో సారస్ మేళా జరుగుతుంది. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో జరిగే ఈ మేళాలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి నేరుగా విక్రయిస్తారు. చేనేతలు, హస్తకళలు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు సహా ఎన్నో గ్రామీణ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి.

**...డెస్క్**

**వనపర్తి జిల్లా**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎం ఎం ఈ ఓ పథకం ద్వారా వనపర్తి జిల్లాలో రెండు ఫార్మర్ ప్రొడ్యూజర్ ఆర్గనైజేషన్ ల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వందశాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని వనపర్తి డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి ఆకాశవాణికి తెలిపారు.

**బైట్ : రామ మహేశ్వర్ రెడ్డి వనపర్తి జిల్లా డి ఆర్ డి ఓ**

**...పిటీసీ- వనపర్తి**

**కల్వకుంట్ల కవిత...**

నేరెళ్ల బాధితులను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దగా చేస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్ లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 2017లో ఇసుక మాఫియాను అడ్డుకున్న నేరెళ్ల దళిత, బడుగు వర్గాలపై

అప్పటి ప్రభుత్వం దాష్టీకానికి పాల్పడిందని అన్నారు. బాధితులపై కేసులు, జైలర్ నివేదికలు, అప్పటి డీఐజీ పరిశీలన నివేదికలు, జాతీయ ఎస్సీ కమిషన్ ప్రజా కోర్టు రికార్డులను ప్రభుత్వం వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధితులకు 5, 10 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించారని, ఇది సరిపోదని అన్నారు.

....డెస్క్

**శ్యామ్‌జీ కృష్ణవర్మకు ప్రధాని నివాళి**

మహా విప్లవకారుడు, స్వాతంత్ర సమరయోధుడు శ్యామ్‌జీ కృష్ణవర్మ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. మాతృభూమిని పరాయి పాలన సంకెళ్ల నుంచి విముక్తి చేసేందుకు శ్యామ్‌జీ కృష్ణవర్మ తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మాతృభూమి గౌరవాన్ని కాపాడేందుకు ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావాన్ని దేశం ఎన్నటికీ మరచిపోదని మోదీ అన్నారు.

...పిఐబి

**సిరిసిల్ల...**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 6న కలెక్టరేట్ లోని ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి .నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగం లోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ఎంపికైన అభ్యర్థులకు 20 నుంచి 50వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

...పిటీసీ- సిరిసిల్ల

**సింగీతం శ్రీనివాస రావు...**

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు వయోధిక ఆరోగ్య సమస్యలతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 95

సంవత్సరాలు. సింగీతం శ్రీనివాసరావు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. సృజనాత్మక ప్రయోగాలకు పెద్దపీట వేసిన ఆయన.. 94 ఏళ్ల వయసులో 'సింగ్ గీతం' చిత్రాన్ని తెరకెక్కించారు. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో దర్శకుడిగా, రచయితగా, సంగీతాభిరుచిగల సృజనశీలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు చెన్నైలో జరుగుతాయి.

...డెస్క్

**కరీంనగర్...**

మహిళా పారిశ్రామికవేత్తలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదుగుతూ, ఇతరులకు ఉపాధి కల్పించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో 'ఏకాం' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు.

....పిటీసీ- కరీంనగర్

**ఎం ఐ ఎం**

ఎంఐఎం నేతలపై దాడులకు కుట్ర జరుగుతోందని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. చంచల్‌గూడ జైలులో ఇందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

....డెస్క్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన

వ్యాసరచన పోటీలను జిల్లా అటవీశాఖ అధికారి బాలమణి, రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ ప్రారంభించారు.

....పిటీసీ- ఆసిఫాబాద్

**వాతావరణం**

తెలంగాణలో రాబోయే రెండు రోజులు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 5, 6 తేదీల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

...డెస్క్